పులులపై విషప్రయోగం?

టెరిటోరియల్ ఫైట్‌గా ప్రకటనపై అనుమానాలు • రంగంలోకి నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు పులుల వరుస మృత్యువాత ఘటనలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. అరుదైన వన్యప్రాణులను సంరక్షించాల్సిన రాష్ట్ర అటవీశాఖ వైఖరిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆధిపత్య పోరు వల్ల పులులు మృత్యువాత పడలేదని తేలింది. విషప్రయోగం జరిగిందా, పశువుకు, పులికి మధ్య జరిగిన పోరులో చనిపోయాయా, ఎవరైనా కావాలని కొట్టి చంపారా? అన్నది తేలాల్సి ఉన్నది. కుమ్రంభీం జిల్లా కాగజ్‌నగర్ కారిడార్ దరిగాం అటవీ ప్రాంతంలోని గొందిలో మూడురోజుల వ్యవధిలో రెండు పులులు మృతి చెందాయి. ఆడపులి మరణించినప్పుడు టెరిటోరియల్ ఫైట్ జరిగినట్టు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. డిసెంబర్ 27న పశువులపై పులి దాడికి పాల్పడినట్టు పేర్కొన్న అటవీశాఖ అధికారులు.. ఆ పశువు మాంసం తిన్న ఎస్-16 అనే అడ పులి వారం తరువాత మరణించింది. అదే స్థలంలో ఎస్-9 కారకస్ అనే మగపులి మృత్యువాత పడటం తీవ్ర చర్చనీయాంశమైంది. పులులు మృతి చెందిన ప్రాంతానికి కూతవేటు దూరంలోనే అటవీశాఖ అధికారులు పశు కళేబరాన్ని గుర్తించారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు మంగళవారం నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) సిబ్బంది రంగంలోకి దిగారు. టెరిటోరియల్ ఫైట్ జరిగినట్టు ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో పులుల మృతిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పులి దాడిలో పశువు మృతి చెందడంతో విషప్రయోగం జరిగిందా అన్న అనుమానాలూ వ్యక్తం అవుతున్నాయి. పులుల మృతిపై రాష్ట్ర అటవీశాఖ అధికారుల వైఖరిపై అనుమానాలకు తావిస్తున్నది.

పులి తలకు గాయాలు, విరిగిన కాళ్లు

ఎన్‌టీసీఏ అధికారుల దర్యాప్తులో పులుల తలలకు బలమైన గాయలు ఉన్నట్టు గుర్తించారు. పైగా కాళ్లు విరగడంతో పశువుకు, పులికి మధ్య జరిగిన ఆధిపత్య పోరా, ఎవరైనా కావాలని కొట్టి చంపారా అని అనుమానిస్తున్నారు. ఎలాంటి వీడియో ట్రాక్ కెమెరాల్లో రికార్డ్ కాకపోవడం గమనార్హం. మొదటి పులి మరణించిన 300 మీటర్ల దూరంలోని కుమ్రంభీం కాలువలో పడి ఎస్-9 కారకస్ అనే మగ పులి చనిపోయింది. మగ పులికి పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు పశువైద్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇదే సమయంలో కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ శాంతారాంతోపాటు కుమ్రంభీం జిల్లా డీఎఫ్‌వో నీరజ్ బృందం ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని గమనించారు. దీనిపై కేంద్ర బలగాలు క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతున్నాయి. రెండు పులుల మృతిపై మిస్టరీ వీడాల్సి ఉంది.

పులి కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అటవీ అధికారుల ప్రకటనలపై అయోమయం

అటవీశాఖ అధికారుల ప్రకటనలపై అయోమయం నెలకొంది. ఎస్16 అనే ఆడ పులి మరణించిన సమయంలో అటవీ అధికారులు పూర్తి స్థాయి విచారణ జరపకుండానే రెండు పులుల మధ్య టెరిటోరియల్ ఫైట్ జరిగిందని, ఆ ఫైట్‌లో ఆడపులి మరణించిందని ఎందుకు ప్రకటించాల్సి వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అటవీశాఖ గత కొద్ది రోజులుగా 'యాంటీ పోచింగ్ డ్రైవ్' చేపడుతున్నది. ఈ సమయంలోనే రెండు పులులు మృతిచెందడం గమనార్హం. టైగర్ కారిడార్‌లో కెమెరాలతో పకడ్బందీగా ట్రాకింగ్ ఏర్పాట్లు ఉన్నా రెండు పులులు మృతి చెందిన ఘటనలు కెమెరాల్లో రికార్డు కాకపోవడం, ఈ ఘటనల పట్ల వాస్తవాలు తెలుసుకోకుండానే హడావుడి ప్రకటనలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విషప్రయోగంతోనే పెద్దపులి మృతి

అటవీశాఖ అధికారుల ప్రాథమిక నిర్ధారణ

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కాగజ్‌నగర్, డిసెంబర్ 9: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో మగ పులి విషప్రయోగంతోనే మృతి చెందినట్టు ప్రాథమికంగా నిర్ధారించామని పీసీసీఎఫ్ డోబ్రియాల్, అడిషనల్ పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) పర్గెయిన్, సీసీఎఫ్ శాంతారాం తెలిపారు. సోమవారం గుర్తించిన మరో పులి కళేబరాన్ని మంగళవారం పరిశీలించారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం వివరాలు వెల్లడించారు. మూడురోజుల క్రితం మృతి చెందిన రెండేండ్లలోపు పులి మాత్రం ఆవాసం కోసం జరిగిన ఘర్షణలోనే మృతి చెందినట్టు నిర్ధారించారు. తాజాగా గుర్తించిన పులి ఎస్-9 అని, దీని వయస్సు ఐదేండ్లు ఉంటుందని తెలిపారు. మృతి చెందిన పులి మెడలో ఇనుప తీగ ఉచ్చు ఉన్నదని, కానీ విషప్రయోగంతోనే అది మృతి చెందినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. చనిపోయిన పశువు ద్వారా ఈ విషప్రయోగం చేసి ఉంటారని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. చనిపోయిన పులి, విషాన్ని చల్లిన పశువు కళేబరం శాంపిళ్లను సేకరించి, హైదరాబాద్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్‌లకు పంపినట్టు వివరించారు. విషప్రయోగానికి పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు అటవీ సిబ్బందితో ముమ్మరంగా గాలిస్తున్నట్టు పీసీసీఎఫ్ డోబ్రియల్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనదని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలకు కలెక్టర్లే ఆర్వోలు

- ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న ఎలక్షన్ కమిషన్
- ఫిబ్రవరిలో రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం
- జిల్లా స్థాయిలో కొనసాగుతున్న శిక్షణలు

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు ముందుగా రిటర్నింగ్ అధికారులు (ఆర్వో)లను నియమించింది. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం ఉన్న జిల్లా కలెక్టర్‌ను ఆర్వోగా నియమించింది. సికింద్రాబాద్ నియోజకవర్గానికి హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)ను ఆర్వోగా నియమించారు. అయితే ప్రస్తుత అడిషనల్ కలెక్టర్ నాన్ ఐఏఎస్ క్యాటగిరీకి చెందిన వారు కావడంతో ఆయన స్థానంలో ఐఏఎస్ అధికారిని నియమించాలని ఎన్నికల అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. మరోవైపు ఎన్నికల్లో విధుల్లో పాల్గొనేవారికి శిక్షణలు ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణలు పూర్తి చేసిన అధికారులు జిల్లా స్థాయిలో చేపట్టారు. ఈవీఎంల అవసరతపై సంక్రాంతి తరువాత ఒక అంచనాకు వస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఎవరికైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే వారు కోర్టు కేసులు (ఎలక్షన్ పిటిషన్-ఈపీ) వేయడానికి 45 రోజుల వరకు సమయం ఉంటుంది. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వచ్చినందున జనవరి 18 వరకు కేసులు వేసే గడువు ఉంది. ఓట్ల లెక్క, ఈవీఎంలపై కేసులు వేసిన నియోజకవర్గాలను మినహాయించి మిగిలిన సెగ్మెంట్లలోని ఈవీఎంలను లోక్‌సభ ఎన్నికల్లో వినియోగిస్తారు. అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందినే మరోసారి వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ఎన్నికలకు పోలీసు బలగాలు తక్కువగానే అవసరం పడతాయని విశ్లేషిస్తున్నారు. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఫిబ్రవరిలో రాష్ట్రానికి రానున్నారు. ఓటర్ల తుది జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.26 కోట్ల ఓటర్లు ఉన్నారు.

శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న పపంచబ్యాంకు బృందం

'శ్రీశైలం'కు ప్రపంచబ్యాంకు బృందం

మరమ్మతులకు తొలి విడతలో నిధుల మంజూరుకు సంసిద్ధత

హైదరాబాద్/శ్రీశైలం, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ప్రపంచబ్యాంకు ప్రతినిధిబృందం మంగళవారం శ్రీశైలం జలాశయాన్ని సందర్శించింది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి హోండా నేతృత్వంలో 10 మందితో కూడిన బృందం సోమవారం రాత్రి సున్నిపెంట ఏపీజెన్‌కో గెస్ట్ హౌస్‌కు చేరుకుంది. మంగళవారం జలాశయ అధికారులతో కలిసి డ్యాం గేట్లు, గ్యాలరీ, డ్యామ్ ముందుభాగంలో ఏర్పడిన ప్లంజ్‌పూల్‌ను సీడబ్ల్యూసీ అధికారులు అతుల్ యాప, అఖిలేశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించింది. 2009 వరద ప్రభావంతో దెబ్బతిన్న కుడిగట్టు కొండచరియలు, రహదారుల పునరుద్ధరణను బలోపేతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో ఇరిగేషన్ అధికారులు వివరించారు. డ్యాం మరమ్మతులకు రూ.700-800 కోట్లు అవుతుందని అంచనా వేసిన అధికారులు మొదటి విడతలో భాగంగా రూ. 139 కోట్ల కోసం ప్రపంచబ్యాంకు నుంచి నిధులు కోరారు. ఈ నేపథ్యంలోనే ప్రపంచబ్యాంకు డ్యాం సందర్శనకు వచ్చింది. ప్రాజెక్టును పరిశీలించిన ప్రపంచబ్యాంకు బృందం మరమ్మత్తుల కోసం జలాశయ అధికారులు పంపించిన అంచనాలతో ఏకీభవించింది. ఇంకేమైనా చిన్న చిన్న మరమ్మతులకు సంబంధించి అంచనాలు పంపిస్తే వాటిని కూడా పరిశీలించి నిధుల విడుదలకు అనుమతినిస్తామని పేర్కొంది. పరిశీలన అనంతరం శ్రీశైలం డ్యాం డ్రిప్ ప్రాజెక్టు నిధుల వినియోగంపై యూ పాయింట్ వద్ద అధికారులతో ప్రపంచబ్యాంకు బృందం సమావేశమైంది. మరమ్మతులకు అయ్యే వ్యయంలో 70 శాతం ప్రపంచబ్యాంకు సమకూరుస్తుందని, మిగిలిన 30 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేలా గతంలో జరిగిన ఒప్పందంపై ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు ఇరిగేషన్ అధికారులు వివరించారు.

సీఎంవో అధికారులకు శాఖల కేటాయింపు!

ఓవరాల్ ఇన్‌చార్జిగా ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లోఅధికారులకు ప్రభుత్వం వివిధ శాఖలను కేటాయించింది. ఈ శాఖల కేటాయింపు తక్షణం అమల్లోకి వస్తుందని ఆదేశాలు జారీచేసింది. ఇకపై అధికారులు తమకు కేటాయించిన శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు, ఫైళ్లను చూడనున్నారు. సీఎంవో కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వీ శేషాద్రికి అన్నింటిపై ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. పలు ముఖ్యమైన శాఖలనుకూడా ఆయనకు అప్పగించారు. సీఎంవోలోని అధికారులు.. వారికి కేటాయించిన శాఖల వివరాలు ఇలా ఉన్నాయి..

వీ శేషాద్రి, ప్రిన్సిపల్ కార్యదర్శి : జనరల్ అడ్మినిస్ట్రేషన్, లా అండ్ ఆర్డర్, హోం, ఆర్థిక, ప్రణాళిక, న్యాయ, శాసన వ్యవహారాలు, ల్యాండ్ రెవెన్యూలతోపాటు సీఎంవో ఓవరాల్ ఇన్‌చార్జి. ఇతర అధికారుల పనులను పర్యవేక్షించడంతోపాటు సమన్వయం చేస్తారు. అలాగే మేజర్ పాలసీలకు సంబంధించి అధికారులందరూ ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించాలి.

కే మాణిక్‌రాజ్, సెక్రటరీ : విద్యుత్తు, నీటి పారుదల, విద్యా (పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యా), రెవెన్యూ (కమర్షియల్ టాక్సెస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్), మైన్స్, జియాలజీ శాఖలు

డాక్టర్ జీ చంద్రశేఖర్ రెడ్డి, సెక్రటరీ: పర్యావరణం, అడవులు, శాస్త్ర, సాంకేతిక శాఖలు, వ్యవసాయం, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, సహకార, మార్కెటింగ్, ఆహార - పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, రవాణా, రోడ్లు, భవనాలు, హౌసింగ్ శాఖలు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి (ఆర్‌డబ్ల్యూఎస్).

షానవాజ్ ఖాసిం, సెక్రటరీ: బీసీ సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, క్రీడలు, యువజన సర్వీసులతోపాటు సీఎం సెక్యూరిటీ.

బీ అజిత్‌రెడ్డి, స్పెషల్ సెక్రటరీ: మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు (మౌలిక సదుపాయాలు, పెట్టబడులు), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ - కమ్యూనికేషన్, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీ, సమాచార శాఖలతోపాటు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్లు, సీఎం రిలీఫ్ ఫండ్ విభాగాలు.

ఎస్ సంగీత సత్య నారాయణ, జాయింట్ సెక్రటరీ: వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం, మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖలు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమంతోపాటు సీఎం కార్యాలయం నిర్వహణ (సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా).

వేముల శ్రీనివాసులు, ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ: దేవాదాయ, సంస్కృతి, పర్యాటకంతోపాటు సీఎంకు వచ్చే పిటిషన్లు, ప్రజావాణి, సీఎంఆర్‌ఎఫ్ (సీఎంవో స్పెషల్ సెక్రటరీ ద్వారా), సీఎంవో కంప్యూటరైజేషన్.

సంక్రాంతికి ఊరికెళ్తున్నారా?

- సోషల్ మీడియాలో అప్‌డేట్స్ పెట్టకండి
- నగదు బ్యాంకు లాకర్లలో భద్రపరచండి
- ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవటం బెస్ట్
- సెక్యూరిటీ అలారం సెన్సార్‌తో సేఫ్
- వాచ్‌మన్‌గా నమ్మకస్తుడినే పెట్టుకోండి
- తెలంగాణ పోలీసుశాఖ హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): సంక్రాంతికి సొంతూరికి వెళ్లేముందు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారా? ఎప్పటిలాగే డోర్‌మ్యాట్ కింద, చెప్పుల స్టాండ్స్‌లో తాళాలు వదిలి వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త అంటున్నది తెలంగాణ పోలీసు శాఖ. సంక్రాంతికి నగరాలను వదిలి ఇంటిల్లిపాది సొంతూళ్లకు వెళ్లి మూడ్రోజుల పాటు పండుగ చేసుకుంటే.. మీకు తెలియకుండా ఇచ్చే సమాచారంతో దొంగలు కూడా మీ ఇంట్లో దొంగతనం చేసి పండుగ చేసుకుంటారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సంక్రాంతి సొంతూళ్లకు వెళ్లేవారు తప్పనిసరిగా పాటించాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. ఆ సూచనలు పాటిస్తూ.. 'పండగకు మీరు సంతోషంగా ఇండ్లకు వెళ్లండి.. అవసరమైతే మీ ఇంటికి మేము గస్తీ కాస్తాం' అంటూ భరోసా ఇస్తున్నారు.

కర్టెన్స్‌తో కవర్ చేయండి

మెయిన్ డోర్‌కు తాళం వేస్తే.. అది కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేప్పుడు ఇంటి లోపల, బయట లైట్లు వేస్తే మంచిదని అంటున్నారు. ఇంటి దగ్గర నమ్మకమైన ఇరుగుపొరుగువాళ్లకు ఇంటిని గమనించాలని చెప్పండి. ఇంటికి వచ్చే, వెళ్లే దారుల్లో, ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకొని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టుకోవాలని సలహా ఇస్తున్నారు. అల్మరా, కప్ బోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద, అల్మరాపైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో, కప్‌బోర్డ్స్‌లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచటం ఉత్తమమని చెప్తున్నారు. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్లకు, గుడికి వెళ్లేప్పుడు తగు జాగ్రతలు తీసుకోవాలని, బయటికి వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరిస్తున్నారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచిస్తున్నారు.

పోలీసుశాఖ సూచనలు

- ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి.
- సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోండి.
- మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం అమర్చుకోవడం మరీ మంచిది.
- తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి.
- మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. తప్పనిసరిగా డయల్ 100కు కాల్ చేయండి.
- మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వెయ్యడం మంచిది.
- నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్‌మెన్/ సెక్యూరిటీ గార్డ్/సర్వెంట్‌గా నియమించుకోవాలి.
- మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకొంటూ ఉండాలి.
- ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడండి. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నది.

సింగిల్ పేరెంటా.. నో అడ్మిషన్!

- ప్రైవేటు స్కూళ్ల కొత్త అరాచకం
- పేరెంట్స్ చదువుకోకున్నా అడ్మిషన్ లేనట్టే
- ఫీజులు చెల్లించే స్తోమత ఉన్నా సీటు నో
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

అతడి పేరు అవినాష్. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతడి కూతురు వర్షిణికి నాలుగేండ్లు. మనస్పర్థల కారణంగా భార్య అతడికి దూరంగా ఉంటున్నది. అప్పటి నుంచి కుమార్తె ఆలనాపాలనను తానొక్కడే చూసుకుంటూ వస్తున్నాడు. స్కూల్‌లో చేర్చే సమయం రావడంతో ప్రముఖ స్కూల్‌లో అడ్మిషన్ ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసి స్నేహితులతోపాటు తను కూడా అడ్మిషన్ లెటర్‌ను డ్రాప్ బాక్స్‌లో వేశాడు. కొన్ని రోజులకు అవినాష్ స్నేహితులందరికీ స్కూల్ నుంచి ఫోన్ చేసి ఇంటర్వ్యూలకు పిలిచినా, అతడికి మాత్రం పిలుపు రాలేదు. ఆరా తీస్తే అసలు విషయం తెలిసి అవాక్కయ్యాడు. సింగిల్ పేరెంట్ కావడంతో అడ్మిషన్ ఇవ్వడానికి స్కూల్ యాజమాన్యం నిరాకరించినట్టు తెలుసుకున్నాడు.

ఆటో డ్రైవర్ అయిన రవికుమార్‌దీ ఇలాంటి కథే. తాను పెద్దగా చదువుకోకపోవడంతో తన కుమార్తెకైనా మంచి విద్య అందించాలని కలలుగన్నాడు. ప్రముఖ స్కూల్‌లో అడ్మిషన్‌కు ప్రయత్నిస్తే ఇంటర్వ్యూకు పిలుపొచ్చింది. ఇంటర్వ్యూలో ఇంగ్లిష్‌లో జవాబులివ్వలేకపోవడంతో అడ్మిషన్ దొరకలేదు.

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): ఇది ఒక్క అవినాష్‌కో, రవికుమార్‌కు మాత్రమే ఎదురైన ఘటనలు కావు. నగరంలో చాలామంది ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నారు. సింగిల్ పేరెంట్ అని, తల్లిదండ్రులు చదువుకోలేదని అడ్మిషన్ ఇచ్చేందుకు స్కూల్ యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. స్కూల్ అడ్మిషన్ ఎలిమినేషన్ జాబితాలో తొలుత వీరి పేర్లే ఉంటున్నాయి. కొత్త సంవత్సరం ప్రారంభంతోనే చాలా వరకు ప్రైవేటు స్కూళ్లు వచ్చే అకడమిక్ ఇయర్ కోసం అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించాయి. కొన్ని స్కూళ్లు ఎల్‌కేజీ నుంచి, మరికొన్ని నర్సరీ నుంచి అడ్మిషన్లు ఆహ్వానించాయి. మరికొన్ని స్కూళ్లలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయి కూడా. జాతీయ, అంతర్జాతీయ సిలబస్ అందించే పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఇవి, సింగిల్ పేరెంట్స్‌కు, పెద్దగా చదువుకోని తల్లిదండ్రుల పిల్లలకు అడ్మిషన్ నిరాకరిస్తుండడంపై పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు పావని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు.

అందుకే నిరాకరణ

సింగిల్ పేరెంట్, విద్యార్హతలు పెద్దగా లేని తల్లిదండ్రుల పిల్లలకు అడ్మిషన్లు నిరాకరించడం వెనక కుట్ర దాగి ఉందని నిపుణులు చెప్తున్నారు. పెద్దమొత్తంలో ఫీజులు చెల్లించే స్తోమత ఉన్నా సింగిల్ పేరెంట్స్ పిల్లల కోసం సమయం కేటాయించలేరని, విద్యలేని తల్లిదండ్రులు తమ పిల్లలతో హోంవర్కులు సరిగా చేయించలేరన్న సాకుతోనే వారికి అడ్మిషన్లు నిరాకరిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు సమయం కేటాయించకుంటే వారు తరగతిలో వెనకబడే అవకాశం ఉందని, తద్వారా స్కూలుకు చెడ్డపేరు వస్తుందన్న ఉద్దేశంతోనే వారు ఇలాంటి వింత ధోరుణులను తెరపైకి తెస్తున్నారని విద్యావేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతిమంగా ఈ విషయంలో పూర్తి వ్యాపార దృక్పథమే కనిపిస్తున్నదని చెప్తున్నారు. కాబట్టి విద్య పేరుతో వ్యాపారం చేసే స్కూళ్లకు ఎంత దూరంగా ఉంటే అంతమంచిదని సలహా ఇస్తున్నారు. అంతేకాదు, పై రెండు కారణాలతో అడ్మిషన్ నిరాకరించే స్కూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



అలాంటి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

సింగిల్ పేరెంట్, తల్లిదండ్రులకు విద్యార్హత లేదన్న కారణాలతో అడ్మిషన్ నిరాకరించడం పూర్తిగా నేరం. దీని వెనక స్కూల్ యాజమాన్యాల వ్యాపార కుట్ర ఉంది. ఇటువంటి వారి వల్ల తమకు ప్రయోజనం ఉండదనే ఇలాంటి పనికి పాల్పడుతున్నారు. పిల్లలు బాగా చదవకపోతే పేరెంట్స్‌దే తప్పని ఎదురుదాడికి దిగుతున్నారు. పోటీ ప్రపంచంలో అందరూ హై బడ్జెట్ స్కూళ్లనే ఎంచుకుంటున్నారు. కానీ, ఆ స్కూళ్లలో ఎలాంటి విద్య అందుతున్నదన్న విషయం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. అరాచకంగా వ్యవహరించే ఇలాంటి స్కూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-జగదీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి, నియోకర్సర్ సొసైటీ

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్రావుపేట శివారులో జాతీయ రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ట్యాంకర్ నుంచి ఎగిసి పడుతున్న మంటలు

టైర్ పేలి పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

- మెట్‌పల్లి శివారులో ఘటన

మెట్‌పల్లి, జనవరి 9: పెట్రోల్ ట్యాంకర్ టైర్ పేలడంతో బోల్తాపడి మంటలు అంటుకున్నాయి. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపేట శివారులో 63 జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ నుంచి 18 వేల లీటర్ల డీజిల్, 4 వేల లీటర్ల పెట్రోల్ లోడ్‌తో మల్లాపూర్ మండలం రాఘవపేటలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌కు ఈ ట్యాంకర్ బయలుదేరింది. మార్గమధ్యంలో వెంకట్రావుపేట శివారుకు రాగానే టైర్ పేలడంతో అదుపుతప్పి పక్కనున్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఆ వెంటనే ట్యాంకర్‌కు పెద్ద ఎత్తున మంటలు అంటుకొన్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాతీయ రహదారిపై రాకపోకలను నిలిపేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని ట్యాంకర్ పేలకుండా జాగ్రత్తలు పాటిస్తూ మంటలను అదుపులోకి తేవడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

టీఎస్ఎంసీ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) నూతన కార్యవర్గం మంగళవారం బాధ్యతలు చేపట్టింది. ఈ సందర్భంగా కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్ కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నకిలీ వైద్యులను ఏరివేస్తామని చెప్పారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని తెలిపారు. వైద్యుల సమస్యలన్నింటిపై ఓ నివేదిక తయారు చేసి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. డాక్టర్లపై దాడులు జరగకుండా కఠిన చట్టాల అమలుకు కృషి చేస్తామని చెప్పారు. మెడికల్ కౌన్సిల్‌కు నూతన బిల్డింగ్‌ను తీసుకొచ్చి, వైద్యులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొత్తసంస్కరణల ద్వారా తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌ను దేశంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందుకు మెడికల్ కౌన్సిల్‌లో ఎన్నికైన సభ్యులు, నామినేటెడ్ మెంబర్లంతా సమన్వయంతో పనిచేస్తామని వివరించారు.

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా దామోదర్

- వ్యూహరచనలో సిద్ధహస్తుడు
- మోస్ట్ వాంటెడ్‌గా దామోదర్

బడే చొక్కారావు

కొత్తగూడెం క్రైం, జనవరి 9 : మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి ప్రాంతానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను ఆ పార్టీ నియమించింది. ఇటీవలే ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించినట్టు సమాచారం. మావోయిస్టు పార్టీ మళ్లీ తన ఉనికిని చాటుకోవడంతోపాటు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా మావోయిస్టులు తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ.. అప్పుడప్పుడు అలజడులు సృష్టిస్తూ వస్తున్నారు. అయితే మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కోవిడ్ బారినపడి 21 జూన్ 2021న మృతిచెందిన విషయం విదితమే. అప్పటినుంచి తెలంగాణ కార్యదర్శి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఆ పార్టీ కట్టుదిట్టమైన వ్యూహాలు రచించింది. ఈ స్థానాన్ని దక్కించుకునేందుకు మావోయిస్టు నేత ఆజాద్ సైతం తనవంతు ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. చివరికి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా దామోదర్‌ను నియమించింది. గతంలో భద్రతా దళాలను టార్గెట్ చేసి వారిపై కాల్పుల జరపడంతోపాటు ల్యాండ్‌మైన్ పేల్చిన ఘటనల్లో ఈయన కీలక పాత్ర పోషించాడు. పోలీస్ రికార్డుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు.

మెహందీ కోన్ తయారీ కంపెనీ సీజ్

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): హానికరమైన రసాయనమైన 'పిక్రామిక్ యాసిడ్'ను కలుపుతూ మెహందీ తయారు చేస్తున్న ముఠాను డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్ మెహదీపట్నంలోని షకీల్ ఇండస్ట్రీస్‌లో ఈ మెహందీ కోన్‌లు తయారు చేసి 'స్పెషల్ కరాచీ మెహందీ కోన్' పేరుతో మార్కెట్‌లోకి అమ్ముతున్నట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వెల్లడించారు. కంపెనీని సీజ్ చేసినట్టు తెలిపారు.

SALAR JUNG MUSEUM, HYDERABAD

e-Publishing Notice

Tenders are in invited under e-publishing platform for Printing & Supply of Admission Tickets in the Salar Jung Museum, Hyderabad. Tenderers can download the tender schedules from procurement site i.e www.eprocure.gov.in/CPPP. Submission of tenders offline at Salar Jung Museum, Hyderabad.

Bid publish date : 10.01.2024, 10.00 AM.
Bid Submission closing date : 29.01.2024, 3.00 PM.
Bid opening Date : 29.01.2024, 3.30 PM.

Further details can be seen at www.eprocure.gov.in/cppp.
- Tender ID No.2024_SJM_741002_1

Sd/-
DIRECTOR

భారత ప్రభుత్వం
ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా
హైదరాబాద్ సర్కిల్, హైదరాబాద్

O/o సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్ట్, ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్, కేంద్రీయ సదన్, IIవ బ్లాక్, IIIవ అంతస్తు, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్-500001 (TS), ఫోన్ నం. 040-24658124, 040-24651012

ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన

దిగువ పనుల కొరకు CPWD/రాష్ట్ర ప్రభుత్వ PWD/రైల్వేలు/MES/ ASIతో నమోదైన కంపెనీ/ సంస్థ/ ఏజెన్సీ/ కాంట్రాక్టర్ నుండి సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్ట్, ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్, హైదరాబాద్ వారు భారత రాష్ట్రపతి తరపున ఆన్‌లైన్ విధానం లో **"ఓపెన్ ఇ-టెండర్లు"** కోరుచున్నారు.

క్ర. సం.	పని పేరు	అంచనా మొత్తం	బయానా మొత్తం	బిడ్ దాఖలుకు చివరి తేది
1	MW (SR) - సంగమేశ్వరాలయ గార్డెన్, ఆలంపూర్, జోగుళాంబ, గద్వాల జిల్లాలో పర్యావరణ అభివృద్ధి - పని నిర్వహణ టెండరు ఐడి: 2024_ASI_788276_1	రూ. 41,39,918/-	రూ. 1,03,498/-	22-01-2024న 11:00 గంటలు

టెండర్ యొక్క మరింత సమాచారం/సవివరమైన సమాచారం కొరకు **https://eprocure.gov.in /eprocure/app** మరియు **www.asi.nic.in**ను దర్శించండి. పై ప్రకటనకు ఏదేని సవరణ/అనుబంధం జారీ చేయబడినచో అది **https://eprocure.gov.in/eprocure/app**లో మాత్రమే ప్రచురించబడును.

సం/- **సూపరింటెండింగ్ ఆర్కియోలజిస్ట్, ASI, హైదరాబాద్ సర్కిల్**